కొండపల్లి అంత అందంగా ఉంటుందని నా కిదివరకు ఎవరూ చెప్పలేదు. మా జీపు నారింజతోటల మధ్యనుంచి పాము బారలాంటి రోడ్డువెంట మెల్లగా పాకుతోంది. ముందుసీట్లో కూర్చొన్న సింగు కుడి భుజం జీపుముందు అద్దంలోంచి కన్పించే రోడ్డు సగం భాగాన్ని కప్పేసింది. లోపలంతా ఉక్కగా వుంది. రాళ్ళమధ్య, గతుకుల్లో పడి లేస్తూ నడుస్తోంది జీపు. బండి కుదుపుకంటె మనస్సు కుదుపు మరీ బాధ పెడ్తోంది నన్ను. ఉండుండి సింగు సిగరెట్టు వెలిగించాడు. లోపలంతా పొగ చుట్టేసి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

మనస్సుకు నచ్చని పని చేయిస్తోన్న సింగు మీద నాకు విపరీతమైన కోపం వస్తోంది. అప్పటికి ఆరు నెలలే అయింది నేను సెటిల్మెంటు ఆఫీసులో గుమాస్తాగా చేరి. నేను చేరిన మరి రెండు నెలలకే హైదరాబాదునుంచి బదిలీ చేయించుకుని ఆఫీసరుగా వచ్చాడు సింగు. మనిషి తరహా అంతా విచిత్రం. ఉద్యోగంలో పెద్దా చిన్నా ఏమీ పాటించకూడ దంటాడు. దండాలు పెట్టడాలూ, చేతులుకట్టుకు నిలబడడాలూ అక్కరలేదని మొదటిరోజే చెప్పేశాడు. అందరూ అతని దగ్గరికి పోవచ్చు. అతను అందరితో కులాసాగా తిరుగుతాడు. అదీ ఇప్పటి పద్ధతి.

ఏళ్ళైమంది గిరిజనులకు కొండపల్లి ఖిల్లా ప్రాంతంలో సెటిల్మెంటులు నిర్మించాలంటే నన్నా పనికి నియమించాడు సింగు. అసలే విజయవాడ బ్రతుకుతో విసిగివున్న నాకు ఇది మరీ కంటకమయింది. ఓరోజంతా చెప్పకున్నాను. అంతా విని బిగ్గరగా నవ్వుతాడు. "కొండపల్లి అంటే ఆటబొమ్మలే గుర్తులా వుంది నీకు–మంచి తోటల్ని, కావల్సినంత ఆకాశాన్ని, ఇంకా కావలిస్తే అందాన్ని చూపిస్తాను పద" అని వెంటబెట్టుకు బయలుదేరాడు.

తీరా విజయవాడ పొలిమేర లందాటేసరికి సింగు చెప్పినమాట వాస్తవ మనిపించింది.

"కథలు వ్రాస్తానంటావ్? ఆ మాత్రం పెర్స్పెక్టివ్ లేకపోతే ఎలా గోయ్!–ఈ నారింజతోటలు చూడు —మరి రెండు మైళ్ళు పోతేమామిడి తోపూ, కొండలూ బ్రహ్మాండంగా కనిపిస్తాయి" అంటూ సిగరెట్టుపొగ వదులుతున్నాడు సింగు.

ఇరవై యేళ్ళు ఆంధ్రలోనే గడపడంవల్ల తెలుగు బాగావచ్చు నతనికి. ఇంకా కావలిస్తే కొందరు తెలుగు రచయితల గేయాలు కూడా చదువుతాడు. అయితే సిన్సియర్‌గా ప్రతి మాటా చెప్పాలన్న తాపత్రయంతో మాటలు కృతకంగా వస్తాయి. ప్రతి చిన్న పదాన్నీ పంజాబీలోలాగా వట్టిపట్టి ఉచ్చరిస్తాడు—

"ఏంకీ–మీకవులకి నారింజతోటలుచాలవూ? ఇక్కడ కవిత్వం చెప్పలేనివాడివి విజయవాడ పందుల మధ్య, బజారు మనుషుల మధ్య ఏం చేస్తావ్ ?–సెటిల్మెంటు పని పూర్తయితే పెద్ద కావ్యం తయారవాలి. కలెక్టరుగారికి అంకితం ఇప్పిస్తాను."

"నేను కవిని కాదు, రచయితని" అని అందామని వంగి చెప్పబోతే చుట్టపొగ నోట్లోకి ఈ దగ్గుతో ఉక్కిరిస్పింది.

నవ్వు ప్రారంభించాడు నామాట విని— "నవ రచయితలంతే కథ



నిషాద

రాదు. జీవితంలో ఎందుకూ పనికిరాని వాడు రచయిత అవుతాడని మా భాషలో సామెతవుంది-నీ విషయంలో అది నిజంకా దనుకో-అదిగో, కొండపల్లి ఖిల్లా-ఆపవోయ్ జాన్!"-అని అరిచాడు డ్రైవరు వేపు తిరిగి.

ప్లాస్కు బుజానికి తగిలించి, జీపు దిగి నడవడం ప్రారంభించాడు. వస్నా దిగమన్నాడు. జీపుని ఖిల్లాముందుకు తీసుకురమ్మని జాన్‌కు చెప్పాడు.

"మొదట ఇంత కాఫీ పుచ్చుకుందాం-లేకపోతే కడుపు సహాయనిరాకరణ చేస్తుంది" అన్నాడు-రాయిమీద కూర్చుని ప్లాస్కు తీశాడు.

ఖిల్లాదూరంగా కొండవేపు కన్పిస్తోంది. కొండపాదాలను తాకే నీలపునీరు - పక్కనే, ముదురు ఆకుపచ్చలో ఒత్తుగా పెరిగిన పిచ్చి చెట్లూ-పదిగంటల ఎండకి వెండిలా మెరిసే తెల్లటి మేఘం-తెలివి చిత్రకారుడి త్రివర్ణ చిత్రంలా వుంది.

"చాలా బావుంది. ఇక్కడ కొన్నాళ్లుంటే నేను కవినవుతాను."

"అదిగో. అప్పుడే చుట్టూ చూసి మూర్ఛపోతున్నావ్. రచయిత తాను వొళ్ళు మరిచిపోకూడదు. ఇతరులలో ఆ భావాన్ని కలిగించాలి. మొదట కాఫీ సేవించు" అన్నాడు.

ఆఫీసరని ఎంతవినయంగా ప్రవర్తించడానికి ప్రయత్నించినా అవకాశం యివ్వడు సింగు. అతనిలోని సెన్స్ ఆఫ్ హ్యూమర్ విస్తుపోయేట్టు చేస్తుంది. మాటిమాటికీ - అదే ఆలోచిస్తూ నడుస్తున్నాడు—

"హైదరాబాదు చాలా అందమైన ఊరంటారే! (నేనెప్పుడూ చూడలేదు.) అక్కణ్ణుంచి వచ్చేశారేం?"

అదివిని సింగు ఒకటే నవ్వు-కాస్సేపటికి ప్రారంభించాడు. "ఎంతో అందమైనవన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయ్ భయ్యా(-ఉదాహరణకి కలువపువ్వూ, వెలయేరూ-ఇహ నేనెందుకు వచ్చేశానంటావా?-ప్రేమలోగుంజాటన పడడానికి విసుగేసింది ఒక్క రహస్యం చెప్తాను విను - ఎవరినయినా. ప్రేమించు గాని, ............



యువతిని మాత్రం... పోనీ, ఎందుకులే ఆ విషయం" నాభుజంమీద చెయ్యేసి కావాలని కుంటుతూ నడుస్తున్నాడు. నాకతని ప్రతీ మాటా వింతగా నే తోస్తోంది.

"అయితే మీకూ ప్రేమ..."

భుజంతట్టాడు. "ప్రేమలో ఉంటే తమాషాయే అది - దానిగురించి ఆలోచించి నంతసేపూ తరిసుంది. ఆలోచించే తీరిక చిక్కేలోపల నీకు తెలీకుండానే ముంచేస్తుంది. నన్ను ముంచేయకుండానే హైదరాబాదు ప్రేమనుంచి విజయవాడ పందులమధ్య పడ్డాను-పెద్ద కాంట్రాక్టు"—జేబులోంచి నల్లద్దాల కళ్ళజోడు తీసితగిలించాడు.

ఇద్దరు సబార్డినేట్స్ దారిలో కలిశారు. ఎవరో పాతదేవుడి దేవాలయంతో ఊరు ప్రారంభమయింది. ఊరేం పెద్దది కాదు - వరసగా 50 గడప కనిపించాయి - పక్కకి తిరగగానే మళ్ళీ పెద్ద ఖాళీస్థలం...చివర అరటితోట - అక్కడి నీడల్లో కూర్చోవాలన్న ఆసక్తి కలిగించేట్టు-

గ్రౌండ్సుమధ్య మాజీపు కన్పించింది.

"మనజాన్‌కి అందం పిచ్చి తలకెక్కుతుంది"-అన్నాడు సింగ్ జీప్‌నుచూసి-

జాన్ నీలిరంగు పాంటు ఎండలో కళ్ళు చెదిరిస్తోంది. మమ్మల్ని చూసి గ్రౌండ్సుకు మధ్యగా పరిగెత్తుకు వచ్చాడు.

మన క్వార్టర్స్ అటువేపుటసార్-అప్పుడే మీరు ఫర్లాంగుదాటి వచ్చేశారు"—అన్నాడు.

మళ్ళీ జీపు ఎక్కాం. ఎత్తు పల్లాల్ని చూడకుండా తీసుకుపోతున్నాడు జాన్ - మరో 20 నిమిషాలకి కొస్త విశాలమైన స్థలానికి చేరాం. ఎదురుగ్గా పాఠశాల, ఆ పక్కనే వరసగా పది గుడిసెలు, యిటు పక్క అన్నిటికంటె కొస్త ఎత్తుగా ఒక పసుపు పచ్చటిమేడ. పక్కన మట్టి యిళ్ళు ఓ యిరవై-యిదీ అక్కడ దృశ్యం—

ఎన్నాళ్ళుగానో తెలిసినట్టు పసుపుపచ్చ మేడముందు నిలబడిన ముసలమ్మ నమస్కారం చేసోంది—

"ఇదేసార్-మన క్వార్టర్స్-" అన్నాడు జాన్—

మేడకు ముందు సన్నజాజి పందిరీ, రెండు పక్కలా బంతిమొక్కలూ- ఓపక్క మరీమూలకి నైట్‌క్వీన్-చిన్న రైలుపెట్టెలా వుంది మేడ అంతా.

"ఈ ఊరులో ఈ మేడ సుఖానికి సింబల్ లాగ వుంది. నువ్వు చాలా అదృష్టవంతుడివి- ఖర్చు లన్నీ గవర్నమెంటుకి జమ అయేట్టు చూస్తానే" అంటున్నాడు సింగు-

మేడ బాగానే వుంది-ముందు తోటలో చిన్న సిమెంటు బెంచీ, ఓపక్క చేరబడడానికి, ఎవరో ముసలివాళ్లు కూర్చోడానికి వీలుగా ఎత్తు దిమ్మలూ, వేశారు. మెట్లెక్కగానే ఎవరిదో పెద్దఫోటో హాలులో కన్పిస్తోంది. కొండపల్లి బొమ్మల వర్తకం చేసే యజమాని చిత్రపట

# నిదురపోయే సెలయేరు

మది. కొన్నాళ్ళ క్రితం జరిగిన రైలు ప్రమాదంలో అతను మరణించాడని తర్వాత అక్కడి వాళ్ళు చెప్పారు. ఇంత పెద్ద మేడలో నేనొక్కడినే ఉండాలేమోనన్న బెంగపట్టుకుంది. ఆగలేక సింగుని అడిగేశాను.

"రచయితలంత పిరికివాళ్లు మరొకరుండరోయ్-ఈపనిమనిషి నీకు తోడు"అన్నాడు.

డెబ్బై దాటిన ముసలి శరీరాన్ని చూసేసరికి జుగుప్స కలిగింది—ముఖమంతా నవ్వు చేసుకుని గోడకి ఆనుకు నిలబడ్డది ఆమె.

> పెండ్లి చూడడానికి పొరుగూరికి వెళ్లుతున్న అబ్బాయి టైమ్ అయిపోవడంచేత పరుగు పరుగున రైల్వేస్టేషన్ చేరుకొన్నాడు. అప్పుడే బండి కదులుతున్నది.
>
> ఆ అబ్బాయి తొందరగా "సార్, టిక్కెట్ పోతోంది. రైలు ఇవ్వండి సార్" అని కేక వేశాడు.
>
> "ఈ సందులో పట్టదండి" అన్నాడు బుకింగ్ గుమాస్తా నవ్వుతూ.
>
> —యాగంటి రెడ్డెన్న (నరసింగాపురం)

వంగిన నడుంని వినయం మరికొస్త వంచింది. నా చికాకుని గమనించి—"పోనీ ఈమె వద్దులే, మంచి అమ్మాయిని ఏర్పాటు చేయిస్తాను"—అనేశాడు సింగు.

ముసలామెకు విన్పించదుకూడా కాబోలు చెవులకి చెయ్యి అడ్డం ఉంచుకుని సగంమాటల్ని అర్థం చేసుకుంది. "ఉద్యోగం తీసేయకండి బాబూ! పదిఏళ్ళనుంచీ యీ మేడలో పనిచేస్తున్నాను" అంది-సింగు విన్పించుకోలేదు. మేడ మెట్లు ఎక్కుతున్నాడు.

"రేపట్నుంచీ దాని అమ్మాయి వస్తుందిట సార్, పనికి. ఇవాళ కొండవేపు పుల్లలు ఏరుకు రావడానికి వెళ్లిందట"- అన్నాడు జాన్ బాల్కనీలో నిలబడ్డమాదగ్గరికి వచ్చి.

"నాకేం అభ్యంతరం లేదు ఏమంటావ్?" అన్నట్టు నావేపు చూశాడు. "ఎవరో ఒకరు రానీయండి" అన్నాను-భుజానికి అయిన గున్నాన్ని దులుపుకొంటూ—

అక్కడికి మేం యిళ్ళు కట్టించాల్సిన స్థలం మూడు ఫర్లాంగు లుంటుంది. మేడమీద నిలబడితే దూరంగా ఎవరిదో సుసీమా, ఆ పక్కనే ఖాళీస్థలం కన్పిస్తూంది. జేగురురంగు ఆకారంలో కొండలూ - దుబ్బుగా పెరిగిన చెట్లూ—

ముగ్గురు ఉద్యోగుల్ని నాకు అప్పగించేసి ఒక్కరోజు ఉండమన్నా వీలుండదని సాయంకాలమే వెళ్లిపోయాడుసింగు. ఓపక్క ఊరు ప్రశాంతత బావున్నా, ఏదోపిరికితనం మనస్సును పీకుతూనేవుంది. ఆ మేడలో గదులేవీ లేవు—అన్నీ హాలులే. మీద బాల్కనీలో కుర్చీ వేయించుకు రాత్రంతా గడిపాను—

లేచేసరికి వొళ్లంతా మంచులోతడిసి ముద్దయింది. కాలుకదపబోతే నరాలు తిరుగుబాటు చేస్తున్నాయి. ఇక్కడ పడుకోవడం మంచిదికాదని ఎవరూ చెప్పలేదు. తీరా ఫలితం అనుభవించాక అక్కడి అందరిమీదా విసుగేసింది—

తెల్లవారుఝామున మంచినీళ్లకని లేచి వెలిగించిన కొవ్వొత్తి నీరు కారి బల్లనిండా పాకి తెల్లటిచారకట్టింది. దగ్గరికివచ్చి కత్తితో చారని తొలగించబోతే రెక్క తెగిన పురుగులు రెండు చచ్చికన్పించాయి—

కాఫీ తాగాలనిపించింది. తల దిమ్ముగా ఏపని చేయడానికీ తోచడంలేదు. అక్కడెవరి పేరూ తెలీదు. జాన్ సింగును తీసుకు విజయవాడ వెళ్ళిపోయివుంటాడని తెలిసికూడా 'జాన్!'అని అరిచాను. హాలంతా ప్రతిధ్వనిస్తోంది. నిజంగానే తలచుట్టూ మఫ్లర్ తిప్పుకొంటూ జాన్‌వచ్చేసరికి విస్తుపోయాను.

"వెళ్లలేదూ విజయవాడకి?"

"వెళ్లి అరగంటక్రితమే వచ్చేశానుసార్-టాప్‌స్పీడ్. మీరిక్కడ మొహమాటపడతారేమోనని సింగ్‌గారు తొందరగా పంపేశారు సార్—మొహంకడుక్కోండిసార్—మంచి టీ రెడీచేయిస్తాను"—హుషారుగా బయటికి పరిగెత్తుతున్నాడు-

"టీ వద్దుకాని—కాఫీ దొరుకుతుందేమో చూడు."

"ఆల్‌రైట్‌సార్—"అని గదిబైటికివచ్చి 'పంకజం'అని అరుస్తున్నాడు.

"ఎవరా పంకజం?"

మొహం చేటంతచేసుకొని మళ్లీ గదిలోకి వచ్చాడు. "నిన్నటిముసిల్ది లేదుసార్-దాని కూతురు. మాధలేచురుగ్గా పనిచేస్తుంది-కాఫీ పంపిస్తానుండండి" మెట్లన్నీ మూడుఅంగల్లో దిగాడు.

కళ్లింకా విడడంలేదు. మళ్లీ పరుపు పరు

తుకు వరుసం పెట్టావున్నా. అయినా కాఫీ తాగితే కాస్త స్తిమితం చిక్కుతుందనేఆశ ఉండిపోయింది. బ్రష్ పట్టుకుని, తువ్వాలు భుజంమీద వేసుకొని కిందికిదిగబోతే కింద మెట్లమీద ఏదో పాటగొణుగుతూ తుడుస్తున్నారెవరో—

వంగపువ్వు రంగుకోక, ఎర్రగా బిగుతుగా భుజాల్ని పట్టుకున్న రవికా, ముక్కు కన్పించకుండా పెద్దనత్తూ, చేతినున్న వెండి గాజులు శబ్దమయేలాగు చీపురు తిప్పుతూ ఒక్కొక్క మెట్టే ఎక్కుతోంది—

నేను అయిదు మెట్లు దిగేసరికి అప్పుడే పదిమెట్లు ఎక్కేసింది. పొరపాటున బ్రష్ జారి మూడుమెట్లుకింద పడితే, ఒక్కసారి బెదిరి తలెత్తింది. విశాలమైన నుదురునీడలో పొడుంరంగుబొట్టూ, మధ్య తళతళమని మెరుస్తూ తెల్లనిజిగి, మెడలో ఎర్రటి పూసలు సన్నటిమెడచుట్టూ రక్తంగీతలాగ—ముఖ్యంగా పెదాలు—అంత ఆశ్చర్యంలోనూ క్రిందపెదవిని నొక్కిపెడితే పెద్దఅరిందా లాగా కన్పించింది. అంతలో భయపడి గోడకి ఆనుకు నిలబడి నాకు తోవ చేస్తూ—

మరీ అంత వలపు కాని ముఖాన్ని చూస్తూ ఆగిపోయాను—మెడమీద రెండు ముడుతలూ శంఖంమీద చారల్లా కన్పించాయి—ఎంతకీ మాట్లాడదు. జాన్ చెప్పిన పేరు గుర్తుంది.

"ఎంత టైమయిందిప్పుడు?"

మాట్లాడదు. అసలు నావేపే చూడడం లేదు. గోడకి అంటుకు నిలబడి నాకు దారి చేసింది. రంగుచీరెతో గోడకి అంటుకుంటే సీతాకోక చిలుక వాలినట్టుంది—నవ్వొచ్చింది. ఇంకా నేనక్కడే నిలబడితే "ఎంతసేపు యిట్లా?" అన్నట్టు భయంగా చూస్తోంది.

అరగంట గడిచాక నేను మేడమీదకి వస్తే బాల్కనీ గోడకి చేరబడి కూచొని తదేకంగా బయటికి చూస్తోంది. టేబులుమీద కాఫీ చల్లారిపోయింది—నాకంతా పంకజం మీదే దృష్టి. ఎండవెలుగు స్తంభంమీద పడి వసులుతోంది—అద్దంలో పంకజం నల్లటి ముఖంమీద సూర్యుడివెలుగు వింతరంగు దిద్దినట్టనిపించింది.

"చల్లారితే కాఫీ మూతపెట్టలేక పోయావ్?"

మాట్లాడదు.

ఆమె వేపు నడవబోతే కాలిలో బలంగా గాజుపెంకు దిగి రక్తం చిమ్మింది. నేలమీద చూస్తే ఏదో ప్రకృతి చిత్రపటం విరిగి ముక్కలయి పడివుంది.

పంకజం యిటు తిరిగింది—నా కాలు రక్తంచూసి కూర్చొని పిచ్చిగా ఏడుస్తోంది. నేను దిమ్మరపోయాను.

"నాకు దెబ్బ తగిల్తే నువ్వు ఏడుస్తావేమిటి?" అంటే వినదు. స్తంభానికి చేరబడి ఒకటే ఏడుపు.

జాన్ పరుగెత్తుకువచ్చాడు: "ఏమయింది సార్" అంటూ.

"నాకు కాలిలో గాజుపెంకు దిగింది—అదిసరే, ఆ అమ్మాయి అట్లా ఏడుస్తుందేం?—ఊరుకోమను—"

దగ్గరికివెళ్లి సంజ్ఞ చేస్తున్నాడు జాన్, ఏం జరిగిందని.

"మాట్లాడదేం? ఎంత అడిగినా?"

నవ్వుతాడు. "దానికి మాటల్రావుటసార్—నాకూ యింతవరకు తెలీదు. ఇప్పుడే వాళ్లమ్మ చెప్పింది."

నేను నిర్ఘాంతపోయాను. పంకజం యింకా ఏడుస్తూనే వుంది. రక్తంమీద హీమోగ్లోబిన్ పొర పేరుకుంది.

జాన్ ఆమె ఎదురుగా చతికలబడ్డాడు—ఏదో సంజ్ఞలు చేస్తోంది. నేలమీద గీతలు గీసింది. మళ్ళీ ఏడుస్తోంది. ఊరుకొమ్మని నోరుమూశాడు జాన్. యింకా ఏడుస్తోంది. రెక్కపట్టుకుని బయటికి పంపించేసివచ్చాడు.

"ఏమయింది?"

"పటాలు తుడుస్తూంటే ఇది కిందపడి పగిలిందట. మీరేమైనా అనుకుంటారేమోనని భయపడి నిలబడిపోయింది ఇంతలో మీ కాలి దెబ్బచూసి భయపడి ఏడ్చేసింది—పిరికిమనిషి."

నేలన కూచుని తడిగుడ్డ తెచ్చి గాజు పెంకుల్ని పోగుచేశాడు జాన్.

"అయితే మాటల్రావా జాన్?"

"సందేహంలేదు సార్ ఏమో—చురుకు మనిషి అనుకున్నాను—బొత్తిగా ధైర్యం లేదండి"—ఇంకా నవ్వుతున్నాడు.

కాఫీ తాగిన కొస్సేపటికి మత్తంతా వదిలిపోయింది. నలుగురు ఉద్యోగులూ పదిగంటలకు వచ్చి పని మాసుకు వెళ్ళిపోయారు. ఇంజనీరు వచ్చి 'ప్లాను చూడడానికి వస్తారా?' అన్నాడు. "సాయంకాలం వస్తాను. ఆరోగ్యం బాగుండలేదు. ఈలోగా పని ప్రారంభించండి" అన్నాను.

పదెకరాల మేరలో అప్పుడే కూలీలు పని చేస్తున్నారు నేను వెళ్ళేసరికి. నా అజమాయిషీలో ఉంచిన ఉద్యోగులలో ఒకడైన విఠలరావు ఎన్ని యిళ్ళు లేచేదీ, ఎక్కడ షెడ్లు లేచేదీ చెబుతున్నాడు. స్థలానికి కుడివేపు పెద్ద సెలయేరు. ఇళ్ళు లేచాక సెలయేటి అందం పెరుగుతుం దనిపించింది. ఇప్పుడంతా బోసిపోయినట్టు, సరుగుడు చెట్ల గాలిని పంచుకొంటూ నిద్రపోతోంది—మందంగాపోతూ మరీ అంత పెద్దవి కాని రాళ్ళని దొర్లించడం, యింకా జాగ్రత్తగా పరీక్షిస్తే చిన్న గలగలలు ఆహ్లాదం కలిగించేవిగా ఉన్నాయి. ఎడమవేపు వరసగా పాతిన సర్వే చెట్లు. ఆ పైన తెల్లగా పాపిటలాగు పొడావు పాటి యిసకబాట. అడపాతడపా బస్సులు




* కుమారి మాత్రలు *
బహిష్టు సమయంలో అనేక బాధలు పడే స్త్రీలకు బాధలన్నీ తొలగించును పొదా: రు. 8
స్పెషల్ రు. 6 అదనపు స్పెషల్: 8/-
ఈ తరాలు ఇంగ్లీషులో వ్రాయండి.
P. Devee & Co (M-1) Calcutta-40.

తెల్ల వెంట్రుక లుండవు

రంగులను చూచి మోసపోవదు. అది తాత్కాలికము. మా సుగంధ "విశేకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇది గాక మెదడుకు చల్లదనమువిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొదిగా నెరసివుంటే ఒక సీసా రు 6. 3 సీసాలు రు. 15. సగము నెరసివుంటే ఒకసీసా రు 7. 3 సీసాలు రు. 18 పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు 9 లు 3 సీసాలు రు 24 లు పనిచేయకపోతే ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

INDRA AYURVED BHAVAN,
A P O. Rajihanwar (H Bagh)



పెప్స్ గొంతు మరియు
గుండె బిళ్లలను
మీరు సేవించేయడల
మీ దగ్గు త్వరితంగాపోవును

పెప్స్‌ను చప్పరించి, నొప్పిని నివారించే ధర్మాను జరుపునట్టి అందలి కమనకర ఆవిరులను ఆస్వాదించండి, అవి గొంతు నొప్పి, రొమ్ము పడిశెము, దగ్గు లేక జలుబునుగలిగించే క్రిములను చంపును. పెప్స్ తక్షణ నివారణను గమించి క్రిములను నిర్మూలించును.



ఇందులో హానికర ఔషధులు లేవు పిల్లలకే సురక్షితంగా ఇవ్వవచ్చును.
రొమ్ము పడిశెములు, గొంతు నొప్పి, పడిశెము, అధిక కఫము జలుబులు, దగ్గులను త్వరితంగా నివారించును
మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి
వి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
FPY-55-1
సోల్ ఏజంట్లు: దాదా & కంపెనీ, 8G, సైనప్పనాయకన్ వీధి, మద్రాసు-1

జారంటపోయినప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తుంది. ఎదురుగ్గా కొండపాదాల్ని ఒరుసుకొంటూ సెలయేరు మలుపు తిరిగి—

చేతిలో ఉన్న ప్లాట్లు చూడాలనిపించడం లేదు. వాటినలాగే పట్టుకుని దూరాన ఒక రాతిమీదకు వచ్చి కూచున్నాను. జీపు ముందు డోర్‌కు చేరబడి కూచొని ఆసాయంకాలాన్ని అతనే పాలిస్తున్నట్టు సిగరెట్టు కాలుస్తున్నాడు జాక్, పనిచేసే కూలీలతో పిచ్చాపాటీ సాగిస్తూ.

ఒడ్డుదాకా గెంతుతూ వెళ్ళి నీటిలో

# నిదురపోయే సెలయేరు

రెక్క తొడుక్కొంటోంది కొంకి.

బాగా చీకటి పడడం నాకు తెలీదు—

“తెవేటరీలు కుడివేపు వరసగా వేయిస్తే బావుంటుంది. సెలయేటినీరు అక్కరకు వస్తుంది. ప్లాటు కనిపించదేమో-కొవ్వొత్తి తీసుకొచ్చాను” అంటూ విమలరావు వచ్చి నా చేతిలో కాగితాలు అలాగే ఉండడం చూసి విస్తుపోయేడు.

“అవును, కుడివేపే బావుంటాయి. సెలయేటినీటిని అలా వుపయోగించడం బావుండదు. బంతిమొక్కలు తెప్పించండి. ప్లాట్లు బావున్నాయి” అని అబద్ధం చెప్పేశాను. నా పరాకుని అంత సులువుగా అర్థం చేసుకోడు విమలరావు. అందుకని అబద్ధాన్ని అసరా చేసుకోవడం తప్పనిసరయింది విమలం వు వెళ్ళిపోయాడు—


## మీకు క్యాడ్‌బరీస్‌తోగల సంబంధం



ఆమె తరచు కష్టపడి చదివే
విద్యార్థిని — తరగతులలోను,
పరీక్షలందు, వీలైనంత అధికంగా
కష్టించి చదివేది. అయితే అంత అధిక
శక్తి ఎలా కలుగుతుందో ఆ కిటుకు
ఆమెకు తెలుసు— అది రెండు
క్యాడ్‌బరీస్ చాక్‌లెట్ ప్యాకెట్‌లను
జేబులో వుంచుకోవడమే. అవి రుచికర
మైనవి, తీసుకు వెళ్లట సులభం—
అవి భోజనవేళలమధ్య నిజంగా
సంతృప్తి కరమైన ఆహారమే.

క్యాడ్‌బరీస్ చాక్‌లెట్ – మిఠాయిని మించినది – ఆహారము






క్యాడ్‌బరీ అనగా శ్రేష్ఠమైనది

దీపంపట్టుకుని ఎవరో కూలీ వచ్చాడు. అటు తిరిగితే దీపం నీడలో మరెవరో వ్యక్తి కూడా కన్పించారు. ఎర్రటి కెంపు రంగుచీరె తెలుస్తోంది—

ఎవరన్నాను.

"చెప్పు" అని నీడలో ఉన్న వ్యక్తిని ముందుకు తోస్తున్నారు. దీపం వెలుగులోకి వస్తే పంకజాన్ని గుర్తుపట్టి ఆశ్చర్యపోయాను.

ఇంకా తడబడుతోంది. "ఏం?" అన్నాను. కాని వెంటనే ఆమెకు అర్థంకాదన్న విషయం స్ఫురణకొచ్చింది—

"మీ కేదో ఉత్తరం వచ్చిందటండి—మా కియ్యమంటే యివ్వదు. మీకే యిస్తానంది."

ఇంకా అలాగే నిలబడితటపటాయిస్తోంది.

"నూరయ్యా!" అని అరుస్తున్నాడు కంట్రాక్టరు.

"నేను వస్తా బాబూ—రోజా డబ్బులు పుచ్చుకోవాలి" అని దీపం వదిలిపారిపోయాడు కూలీ.

"కూచో" అని సంజ్ఞచేస్తే ఆమెకు బోధపడలేదు.

కొంగులోంచి తీసి ఓ టెలిగ్రాం ఇచ్చింది-నేను మధ్యాహ్నం పంపాను. ఇంత త్వరలో టెలిగ్రాం ఎందుకో అని ఆశ్చర్యమేసింది. తీరాచూస్తే నన్ను ఉత్సాహపరచడానికి ప్రయత్నం - మంచి మొక్కజొన్న కండెలూ, ఓ పాతిక పుస్తకాలూ పంపుతున్నాడట. నిరుత్సాహపడకు - అని వ్రాశాడు. నేను బిగ్గరగా నవ్వుతూంటే వింతగా చూస్తోంది పంకజం.

చేయిపట్టుకు ఎదురుగావున్న రాయిమీద కూచోపెట్టాను. త్వరత్వరగా మూగవాళ్ళతో మాట్లాడడం నేర్చుకోవా లనిపించింది. మొదటిపాఠం ప్రారంభించాను.

"నీపేరేమిటి?" అన్నాను వీలయినంత వరకు సంజ్ఞలను ఉపయోగిస్తూ.

మొదట చెప్పడానికి సిగ్గుపడింది. ఏదో అనబోయింది- నాకింకా అర్థంకాకపోవడం చూసి రాతిమీద వేలుతో పెద్ద అక్షరాలు రాసింది. "పం...క...జం".

ఒక్కసారి మాట్లాడిస్తే ఏవేవో చెప్తోంది- ఉత్తరం తీసుకురావడానికి చాలా అలసిపోయాను అంటున్నట్టుంది బహుశా-వింటూ కూచున్నాను.

"ఇక పోదామా సార్ - చీకటి పడింది" అంటూ వచ్చాడు జాన్.

"జీప్‌లో వస్తావా?" అన్నాను లేచి.

అర్థంకాలేదు - సంజ్ఞ చేశాను.

"ఇదెందుకు సార్ - వాళ్ల మావ ఎవడో ఉన్నాడు. వాడితో పోతుంది" అంటున్నాడు జాన్.

"పరవాలేదులే. ఇటువేపు తీసుకురా జీప్‌ను" అని నడిచాను.

జీప్‌లో కూర్చొన్న దగ్గర్నుంచీ ఒకటే కూడావుడి చేస్తోంది పంకజం. వెనకసీట్లో పక్కనే ఒదిగి కూచుంది. బండ గతుకుల్లో లేచి పడినప్పుడల్లా పక్కనే చేతిని పట్టుకుని నుల్లి పడుతోంది. ఉండుండి రోడ్డుమీద పోయేవాళ్లని పిలిచి, పెద్ద కేకలుపెట్టి పలకరిస్తోంది. అంతా విచిత్రంగా చూస్తున్నాను. ఆమె అరుస్తున్నకొద్దీ జాన్ మరీ గతుకుల్లో పోనిస్తున్నాడు జీప్‌ను.

మలుపు తిరగడంతో తూలి బుజానికి ఆనుకుంది. తలలో పిచ్చిపువ్వులు ముఖానికి రాసుకుంటున్నాయి. పువ్వుల్లో సువాసనలేదు - పచ్చిఆకులవాసన బుర్రంతా వ్యాపించింది— మౌనంగా బయటికి చూస్తూ కూచున్నాను- ఉండుండి లోపలలైటు వెలిగించాడు జాన్. అంత వెలుగు చూడలేక ఒక్కసారి కళ్లుమూసుకొని జారిపోయిన పమిటను వెదుక్కొంటోంది. నావేపు వింతగా చూస్తోంది. ముఖానికి గుచ్చుకొంటున్నాయని తలలో పువ్వులు తీసేశాను. లేత కనకాంబరం రంగు వెలుగులో ఒలిసినట్టు కన్పించింది.

దీపం ఉంచవద్దని జాన్ బుజంమీద కొట్టోంది. వాడు నవ్వుతున్నాడు. కాస్సేపటికి ఆర్పేశాడు. ఇంక అల్లరి చెయ్యలేదు పంకజం—

నా వీపుకు వెనక 'రైల్' గుచ్చుకొంటోంది. అంతయిరుకులో తప్పించుకోవడం సాధ్యంకావడంలేదు. కొద్దిగా లేవబోతే బండి గతుకులో పడింది. తూలిపోయి పక్కకి జారబోయాను. పంకజం ఆపింది. మోచేతి మోపి ఎడమ బుజంమీదికి చెయ్యి వేసింది. వీపుని వెచ్చనిశ్వాస కొలుస్తోంది. రొమ్ము బలంగా బుజాన్ని ఆనుకుంది. బండి నడిచే శబ్దంలో గాలి రివ్వుమంటూంది. లేవా లనిపించడంలేదు—నుదుటికి చిన్న దెబ్బ తగిలి జివ్వుమంటోంది. పంకజం చీకటలో దొంగలా మాట్లాడ్డంలేదు. కుడిబుజం చెమటపట్టి నావీపంతా తడిసింది. తప్పించుకోకుండా బుజంమీద చెయ్యివేసి దగ్గరగా అదుముకున్నాను. పెద్ద అపాయంనుంచి తప్పించుకొనేందుకు అవకాశం దొరికినట్టు ఒదిగిపోయి - యింకా కుంచుకుపోయి - చేతుల్లో యిమిడిపోయింది పంకజం

మేడముందు జీప్ ఆపి లైటు వెలిగించాడు. పంకజం వెలుగులో ముఖం చూడలేక పోతోంది. పువ్వులకోసం తల వెదుక్కొని నా చేతిలో చూసి నవ్వుకొంది. ముణుకుల మధ్య తల ఆనించుకు యింకా అలానే కూచొంది.

"జీప్ ప్రయాణం బాగా వంటపట్టినట్టుందే! దిగు" అని చెయ్యిపట్టుకొని లాగుతున్నాడు జాన్. వాడివేపు చురచురా చూస్తూ ఉన్నట్టుండి ఒక్కసారి చెంపమీద కొట్టి గెంతు గెంతి పారిపోయింది. నిశ్చేష్టుడైపోయాడు జాన్— నాకు ఒకటే నవ్వు -

పెద్దమనిషి—ఏరా, రామూ, మీ నాన్న ఏడీ?

రామూ—జపానుకి వెళ్లారు.

పె. మ.—అదేమిటిరా? నిన్న సాయంత్రం చీకటిపడేదాకా మాట్లాడుకున్నాము. మరి మీ నాన్న మాటవరసకైనా నాతో విదేశయాత్రకు వెడుతున్నట్లు చెప్పలేదేం?

రామూ—జపాన్‌కి కాదండి జపానుకి.

—మోహన్ (విజయనగరం)

ఆ తర్వాత చాలా విషయాలు త్వరత్వరగా జరిగిపోయాయి; పంకజం యిగనైనాలుగు గంటలు యిక్కడే మేడలో ఉంటుందనీ, కొత్తగా వచ్చినాయన దాన్ని తనతో తీసుకువెళ్తాడంట, అంటూ చాలామంది ఊళ్లో గుసగుసలు ప్రారంభించారని జాన్ చెప్పాడు. నేను నిర్ఘాంతపోయాను. ఆలోచించినకొద్దీ భయమేసింది.

క్రోటన్సు మొక్కలకి నీళ్ళు పోస్తోంది పంకజం. ఈ విషయమంతా చెప్పేసి "నువ్వేమంటావ్?" అని అడగాలని వుంది. ఒక్కసారిగా బెదిరిపోయి వినుకుంటదేమో .. ఇన్ని విషయాలు ఎలా చెప్పాలో తెలీదు నాకు. కుర్చీమీద ఎండపడి నుదుటిని కొలుస్తోంది. "కాఫీ కావాలా బాబూ" అంటూ ముసిల్ది వచ్చింది.

"ఇదిగో చూడు" అని పిలిచానే కాని ఏం చెప్పాలో తోచలేదు.

"పంకజం గురించి ఊళ్లో చాలా మంది ఏవేవో అనుకొంటున్నారట."

మొదట తెల్లబోయింది వృద్ధురాలు.

"ఎవరు బాబూ!"

"పోనీ నాగురించి—అనుకుంటున్నారా?"

"ఏ విషయం బాబూ!"

విసుగేసింది, అంతా చెప్పడానికి- "ఇదిగో- అమ్మీ వాళ్లేమనుకున్నా నాకనవసరం- రేపట్నుంచి పంకజాన్ని యిక్కడ పనిచెయ్యవద్దని చెప్పు. నువ్వే పనిలోకి రా -"

మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఆలోచిస్తే ఉదయం తొందరపడ్డానేమో ననిపించింది. పంకజానికి ఆ విషయాలన్నీ తెలిస్తే బాధపడవచ్చు. కాని అప్పట్లో యిక అంతకంటె మరో గత్యంతరం లేదు. ప్రభుత్వఉద్యోగిగా యిట్లాంటి విషయాలు ఉద్యోగానికి భంగం కలిగిస్తాయి-

మళ్లీ సాయంకాలానికి 'మంచిగా నేజరిగిందని' నిమిత్తపడ్డాను.

అటు తరువాత మరి పదిరోజుల వరకు పంకజం కన్పించలేదు. ఇళ్లపనికూడా ఓ కొలిక్కి వచ్చింది. పునాదులుపూర్తయి సగం గోడలు లేచాయి. రెండుపూటలా అక్కడికి వెళ్లి వస్తున్నాను.

ఓసాయంకాలం జీప్ పాడయిందన్నాడు జాన్ "స్పేర్ పార్ట్లు తెచ్చుకోవాలి, విజయవాడ వెళ్లివస్తాను సార్" అన్నాడు. వెళ్ళమన్నాను.

మర్నాటిసాయంకాలం పని జరుగుతున్న చోటికి వస్తూంటే దారిలో ముసిల్ది కనిపించింది. పంకజానికి జ్వరంగా ఉందట. ఎవరో బంధువును పిలుచుకు పోవడానికి వెళ్తున్నానంది.

నే నాశ్చర్యపోయాను. మరి నాతో చెప్పలేదేం?-"మీకు కోపం వస్తుందని భయపడాను బాబూ -ఆరోజునుంచి అటువేపు వెళ్ళొద్దని దానికి గట్టిగా చెప్పాను"-

"నేను వస్తాను పద" అని యింటికి వెళ్లాను.

గుడిసెరాటకి చేరబడి నీరసంగా కూచొనివుంది పంకజం. చూసేసరికి భయమేసింది. నల్లటిచీర మీద తెల్లటి చుక్కలు దీపం వెలుగులో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

నన్ను చూసి తన కళ్లను తానే నమ్మలేక విస్తుపోతోంది. ఎట్లా పలకరించాలో తెలీలేదు. అరుగుమీద కూచున్నాక నవ్వాను.

అంతలో ముఖం పక్కకు తిప్పుకు ఏడుస్తోంది-

"ఏమిటిరోగం?"

"తెలీదండి- నీరసంగా ఉంటుంది - మాట్లాడదు, అడిగితే ఏమీ బదులు చెప్పదు."

అమ్మని పిలిచి అంతలో ఏదో చెప్తోంది పంకజం - ముక్కు మీద వేలేసి చూపుతూ 'తప్పు' అంటోంది ముసిల్ది.

"ఏం చెప్తుంది?"

"పిచ్చిది-దానికేం తెలీదు బాబూ!"

ఇంకా ఏడుస్తోంది నిశ్శబ్దంగా-

"ఊర్లో అన్నమాటలు విన్నాక దాని మనస్సుపాడయింది బాబూ-మిమ్మల్ని వెళ్ళిపొమ్మని చెప్పమంటోంది" మనస్సు కలుక్కుమంది.

మెల్లగాలేచి మంచంమీద తల ఆనించి పడుకొంటోంది.

"నేనువెళ్తాను - ఏంరోగం ఉన్నట్టు లేదులే" అని వచ్చేశాను- గుమాస్తాలంతా వెళ్ళిపోయారు. అంత చీకటిలోనూ తెల్లటి దారి పాముపొరలా కనిపిస్తోంది.

పంకజానికి మాటలాడడం వస్తే బావుణ్ను అనిపించింది. నిశ్శబ్దానికి అర్థం ఒక్కొక్కప్పుడు మనస్సుని మించి పెరిగిపోతుంది. పంకజం మౌనానికి అర్థం చెప్పగలయంత్రాలే వుంటే పెద్దసృష్టిరహస్యం బయటపడేది.

# నిదురపోయే సెలయేరు

ఆకళ్లల్లో దైన్యం; నిస్సహాయత యింకా మరపురావడం లేదు. బంగళాకు రావచ్చునని వాళ్ళ అమ్మతో చెప్తే బాగుంటుందేమో?- ఏం చెయ్యడానికీ శక్తిచాలడంలేదు. ఇంత చిన్న ఊరులోనూ ఓసంఘం అంటూ ఏర్పడింది. ఆ సంఘం చాలు మామంచిచెడ్డలను చేరీజు వెయ్యడానికి-

తలవొంచుకు నడుస్తున్న వాడినల్లా రాయి తన్నుకు పడబోయాను. కాని చీకటిలో ఎవరినో అనుకున్నాను. రెండు పక్కలా దట్టంగా చెట్లు- అప్పుడే లేచే చతుర్దశి చంద్రుడి వెన్నెల చారలు-

"కళ్లు కన్పించవురా నీకు?"అంటున్నాడా వ్యక్తి. జవాబు చెప్పకుండా, పక్కకి తప్పించుకు వెళ్లిపోబోయాను- వెనకనుంచి పిలిచాడు.

"ఒరే-యిలారా."

నివ్వెరపోయాను గొంతులో గరుకుతనానికి గుండె వణికింది—అసంకల్పితంగా వెనక్కు నడిచాను.

"నువ్వేనా ఆ యిళ్లు కట్టిస్తున్నది?"

"అవును. ఏం?"

"పెభత్వం అంటే నువ్వేనా?"

"నేను కాదు."

"సారేలే—యీళ్ళంతా ఎదవలు. ఆళ్లకి యిల్లిత్తే రేపు నిన్నూ నీ పెభుత్వాన్నీ తంతారు. నీకెరిక?"

"అది నా కనవసరం"—నడవబోయాను.

"ఒరే—మాటవినిపించుకోయేస్"

"ఏఁటి చెప్పు?"

"పంకి సెరుగుదువా?"

"ఎవరో?"

"ఇదిగో, ఏసాలెయ్యకు—ఒక్కటి చెప్తాను విను. పంకితో నువ్వు మాట్లాడానికి వీల్లేదు. మాణిక్యంగాడిసంగతి నీకు తెలీదు. గుర్తుంచుకో" అన్నాడు.

అంత శరీరాన్ని చీకటిలో చూడడానికి భయంగా నేవుంది. చవకబారు కల్లువాసన భరించరానిదిగావుంది. ఏం జవాబు చెప్పకుండా నడిచాను—

వెనక వాడు నవ్వుతున్నాడు.


* * *

ఉదయాన్నే కంట్రాక్టరు వచ్చాడు—యిళ్ళదగ్గరికి బయలుదేరడానికి.

"మాణిక్యం అనేవాడిని తెలుసా మీకు?"

మొదట నన్ను ఆశ్చర్యంగా చూశాడతను. "అసలు వాడిపేరు ఎలా తెలిసింది మీకు?"

"చెప్పండి."



చిత్రకారుడు—కలువకొలను సదానంద (పాకాల)

"వాడో విధంగా ఈ ఊళ్ళో రాజ్యం ఏలుతున్నాడండి. వెనక అయిదుమంది జెమాజెట్టీలు ముద్దుతున్నారు. నాలుగేళ్లక్రితం ఓ దొమ్మీకేసులో రాత్రికి బొమ్మల కంపెనీ మేనేజరు మేనల్లుణ్ణి సఫా చేసేశారు. సబ్ ఇనస్పెక్టరు ఇద్దరు పోలీసుల్తో పరిశోధనకు వస్తే ఊరు పొలిమేరల్లోనే వాడికి బుద్ధిచెప్పి తగిలేశారు. రెండు నెలలు తిరక్కుండానే ఆ సబ్ఇనస్పెక్టరు తెలంగాణాకు బదిలీ చేయించుకున్నాడు. తెలిసి వాడితో ఎవరూ నోరు కలపరండి—రెండు బుజాలూ రెండు ఆయుధాలు వాడికి—"

అంతే. ఆతర్వాత మాణిక్యంగురించి అడగలేదు. కాని పంకజం ప్రస్తావన వాడెందుకు తీసుకువచ్చాడో అర్థంకావడం లేదు. పునరావాసాలు కట్టడం వాడికి యిష్టం లేనట్టుంది. అయినా ఏ విధంగానూ నేను ఆపలేను—కాకపోతే పంకజంతో మాట్లాడడం మానుకోవడం తప్ప. కాని మాణిక్యం అంత భయపడవలసిన వ్యక్తా? ఆలోచన పెరిగినకొద్దీ చికాకు ఎక్కువయింది. మరోసారి మాణిక్యాన్ని కలిస్తే బావుణ్ననిపించింది.

(ఇంకా ఉంది)



(గత వారం తరువాయి)

తర్వాత నెలరోజులవరకూ ఆ విషయాలే మరిచిపోయాను. సమయానికి సిమెంటు రాలేదు. అందువల్ల పని ఆగిపోయింది. ఇద్దరు సూపర్‌వైజర్లు పరిస్థితిని గమనించడానికి వచ్చారు. బృహత్తర ప్రయత్నంతో మళ్లీ కొంతవరకు పని సజావుగా సాగనారంభించింది. ఓ రోజు ముసిలి కనిపించి. "పంకజం తేరుకొంది బాబూ!" అని చెప్పిన జ్ఞాపకం మాత్రం ఉంది.

సింగు పిల్లల్ని చూడడానికని 15 రోజులు సెలవుపెట్టి మధ్యప్రదేశ్‌కు వెళ్లాడు–ఇక నాకెవరూ తోడు మిగల్లేదు. నన్ను అర్థంచేసుకుని సాధక బాధకాలు గమనించేవారు డిపార్టుమెంటులో ఎవరూ లేకపోవడంతో రెండు నెలలు ఇక్కడ ఉండాల్సిన గడువు యింకా ఎక్కువయే ప్రమాదాలు కనిపించాయి.

ఒకరోజు మరీ చీకటిపడ్డాక విజయవాడ జీపులో వెళ్లి తిరిగి వచ్చేసరికి మేడమెట్ల మీద ముంచుకపోయి పంకజం పడుకొని వుంది. పువ్వుల్లో వొళ్లు విరిచిన కొమ్మను చేలను విసురుగా పడేస్తే ఎలా వుంటుంది–? అలా–

రోగం పెద్దది కాకపోయినా పంకజం ముఖంలో ఎరుపును మింగేసింది. నుదుటికి పెట్టుకున్న పెద్దబొట్టు నిద్రమత్తులో చేతికి రాసుకు ముఖమంతా పాకింది – నిద్రలో పెదాల్ని తడిచేసుకుంటోంది.

తట్టిలేపితే తుళ్లిపడింది–, ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్టు వింతపడుతోంది– ఒక్కసారిచుట్టూ గమనించి నావేపే తదేకంగా చూస్తోంది. దీపపు నీడలో కళ్లల్లో

ఆకలి పూర్తిగా అర్థం కావడంలేదు. ఆశ్చర్యమేమో?-ముఖం దీపంవేపు తిప్పబోతే కొయ్యితీసి ముఖం తప్పించుకుంది. అంతేకాదు మెల్లదగ్గర గోడకి చేరబడి వింటోంది.

నాకు విసుగేసింది.

మాటలుగాని తనకు కన్నీటని ఆయుధంగా చేసుకున్నదేమోననిపించింది. నిశ్శబ్దం కొంగతినానికి చిహ్నం - ఆ కళ్లల్లో అమాయకత్వం - చూపులో జాలి - తప్పిస్తే పంకజంలో నమ్మకం కలగడానికింకే కారణమూ కనిపించదు.

కుర్చీలో కూర్చుంటే విపరీతంగా తలనొప్పి ప్రారంభమయింది. మరో పావుగంటకు పంకజం భోజనం తీసుకు వచ్చింది. ఇప్పుడిక విసుగు లేదు. బల్లమీద భోజనం ఉంచి బొల్కనీ గోడకి ఆనుకుని కూచొంది.

నిశీధి నిశ్శబ్దాన్ని ఏదో కొత్త ప్రపంచం నుంచి దానిడానికి రహస్యంగా కప్పిన తెరలావుంది ఆకాశం - పంకజం అటువేపు కళ్లు తిప్పితే - ఆకాశం నలుపు కళ్లల్లో ప్రతిబింబం చూసుకొంది. ఏమంటుందేమో నని ఎదురుగా వచ్చి నిలబడ్డాను. ఇందాక ఆమె కన్నీటిపై విసుగుదలను బాగా అర్థం చేసుకున్నట్టుంది. చిన్నగా నవ్వింది. ఉత్సాహం కాదు, తృప్తి కాదు - దుఃఖాన్ని దాచుకొంటూ. అసహాయతకు 'ఒప్పు' రంగువేసి నప్పట ప్రయత్నం ఆ నవ్వులో - అదీ ఆ నవ్వుకి అర్థం.

"ఏందు కేడుస్తా?" అనడిగాను-

నా ముఖంలోకే చూస్తోంది. నాకు అర్థమయేటు చెప్పగలనా అని ఆలోచిస్తోందేమో?-తడబాటు, సందిగ్ధం- ఏదో చెప్పబోయి చెప్పలేని ప్రయత్నం - భయంతో రొమ్ము ఎగిరిపడే బిడియం - ఏదో వింత శక్తిని చూస్తున్నట్టు - అలాగే నిలబడిపోయేను-

అంతలో లేచి - నాకళ్లను తప్పించుకొని భోజనం పళ్లెం తీసుకొచ్చి నాముందుంచింది.

భోజనం ముగించేవరకూ అలా నే కూచుంది.

భోజనం ముగిస్తే వెళిపోతుందేమో నన్న లోభత్వంతో గంటలకొద్దీ నిశ్శబ్దంగా ఉండిపోయాను.

బయట సన్నగా చినుకులు ప్రారంభమయాయి - ఆమె అలాగే నావేపు చూస్తుంది.

నాకు మాట్లాడడం తెలీదు.

అంతే-!

* * *

సింగు వచ్చాడు. మధ్యప్రదేశ్ నుంచి విచిత్రమైన పళ్లు తీసుకొచ్చేడు. "ఎట్లావుంది, యిక్కడి బ్రతుకు?" అంటాడు నవ్వుతూ.

"మనస్సేం బావుండడం లేదు—విజయవాడే నయమేమో ననిపిస్తుంది—మరీ ఎక్కువ విశ్రాంతి లభిస్తే ఏం చెయ్యాలో తెలీదు. ఎక్కువ సంతోషం నుంచి దుఃఖంలాగా, పూర్తి విశ్రాంతిలోంచి భయం, పిరికితనం పుట్టుందేమో" అన్నా.

ఇవన్నీ అర్థం చేసుకోడు సింగు.

"స్త్రీలు మాట్లాడకుండానే చాలా విషయాల్ని చెప్పగలరు భయ్యా—వాళ్ళ కళ్లకి సరయిన అర్థం చెప్పగల డిక్షనరీ నీ దగ్గర వుండాలి. అదీ రహస్యం"—అని, బుజం తట్టాడు. ఎవర్ని ఉద్దేశించి అంటున్నాడో తెలీక తెల్లబోయేను. నవ్వేడు సింగు. అంతే. మరింకేమీ చెప్పలేదు.

తర్వాత పది రోజులకు అనుకొంటాను—యీ సంఘటన జరిగింది.

అంతవరకూ మళ్ళీ మాణిక్యాన్ని కలవలేదు. దాదాపు ఆలోచనలే మరిచిపోయేను.

కాని ఓ రోజు ప్లాటుదగ్గరనుంచి జీప్‌లో వస్తున్నా, మా. జాన్ ఏదో మాట్లాడుతున్నాడు. వీలయితే తనకు కొండపల్లిలోనే ఉండిపోవాలనుందిట. "గవర్నమెంటు ఉద్యోగులందరినీ ఇక్కడ రెండునెలలు వుంచి పంపాలండీ—ప్రతివాడూ ఒక వేదాంతో, కవో అయిపోగులొంటాడు" అంటున్నాడు.

రాతిమీద కర్రలమోపు దించి అలసట తీర్చుకుంటున్న పంకజం కన్పించింది—జాన్ చూశాడు. "కర్రలు మోయడం, నీళ్లు తోడడం, మొదలయిన కొన్ని ప్రత్యేకమైన పనులను దేవుడు స్త్రీలకే ప్రత్యేకించాడు సార్. ఆసమయాల్లో వాళ్ళు మరీ అందంగా కనిపిస్తారు—చూడండి కావలిస్తే."

పళ్ళు బిగపట్టి కాలిలో ముల్లు తీసుకొంటోంది రాతికి ఆనుకుని. పసుపుపచ్చటి చీర మరీ తేలికయి తెరచాప కట్టినట్టు ననక్కా ఊగుతోంది. శరీరం వంపులన్నీ సాయంకాలపు నీడల్లో కలిసిపోయి, కుంచె గీసిన రేఖల్లా కన్పిస్తున్నాయి

"ఒక్కసారి జీపు ఆపు."

"ఎందుకు సార్?—కట్టెల్ని మోయనివ్వకుండా చేయడంలో మనం ప్రపంచానికి చాలా ద్రోహం చేస్తున్నా మన్నమాట. ఇంకా ఆ అందాన్ని దారిలో చాలాకోణాల్లో చాలామంది చూడవలసి వుంది"—తన మాటలకి తానే విరగబడి నవ్వుకుంటున్నాడు జాన్. ఒక్క కుదుపుతో జీప్ ఆగిపోయింది. వెనక్కి చేరబడి స్టీరింగుమీద తల ఆనించాడు.

జీప్ దిగి రాయిదగ్గరికి నడిచేను. ముల్లు తీసిన చోటునుంచి పంకజం కాలిలో రక్తం వస్తోంది. నోటిలో ఉమ్మితీసి తడిచేసి ఇసిక పోస్తోంది. నన్ను చూసి లేచి నిలబడబోయి పక్కని పారేసిన ముళ్ళ కొమ్మమీద మళ్ళీ కాలేసింది. బాధతో తూలి పడబోయి భుజం మీద చెయ్యేసింది. ఈసారి రెండు చోట్ల ముళ్ళు గుచ్చుకున్నాయి.

నా పక్క చూడడంలేదు. చుట్టూ గమనిస్తోంది. జాన్ జీప్‌ను 20 గజాలు ముందుకు పోనిచ్చాడు.




—ఎస్. రఘురామరావు (విల్లివాకం)

నేను వచ్చినప్పటి కంటె ఇప్పుడు మరీ నిశ్శబ్దంగా ఉండడం అలవాటు చేసుకుంది.

"నేను యిక్కడినుంచి వెళిపోతున్నాను"—సూచించాను.

ఆశ్చర్యంతో చూస్తోంది. "ఎప్పుడు" అని అడగలేదు. ఆశ్చర్యం తప్ప, యింకే భావమూ కన్పించదు.

ఏదో అసంతృప్తిగా వుంది—. "నువ్వు నాతో తిరుగుతున్నావని లేకపోతే నేను నీతో తిరుగుతున్నానని అందరూ అనుకొంటున్నారు" అని చెప్పడం నా ఉద్దేశం. కొన్ని క్షణాలు నాలో నేనే కుంజాటనపడి చెప్పబోయేను. ఇంకేదో విధంగా అర్థం చేసుకున్నట్టుంది. గుండెమీద రెండుచేతులూ గట్టిగా ఆనించుకుని "నేనురాను" అని

నూచిస్తోంది. నాకు నవ్వొచ్చింది. పక్కన నవ్వేశాను. విచిత్రంగా చూస్తోంది. నిలబడి రాయికి ఆనుకోబోతే చెయ్యి పట్టుకు కూర్చోపెట్టాను.

అంత దగ్గరగా పంకజాన్ని చూడడం రెండవసారి. కుడివేపు నుదుటిమీద మచ్చ ఎప్పుడూ చూడలేదు నేను—

కొంతసేపు నిశ్శబ్దంగా కూర్చొని లేవబోతూ పంకజాన్ని చూశాను—మళ్లీ ఏడుస్తున్నదేమో ననిపించింది. బుజం మీద చెయ్యేసి కదిపితే నవ్వేసింది—ముఖం కప్పుకొంటుంది. తలమించి బుజంమీదకు నీరసంగా వాలిన అడివిపువ్వులు, చల్లగా చేతిని కొరుకుతున్నాయి. తలమీద చెయ్యి వేస్తే ఆ చల్లదనం వొళ్లంతా పాకింది. అంతకుమించి నీలిరంగు రెవికె బరువూ,— పెదాల వొణుకూ, ఆశ్చర్యం— ఒక్కసారి పంకజాన్ని కౌగలించుకోవాలనిపించింది.

కాని పిరికితనం—

జాన్ దూరంగా హారన్ మోగిస్తున్నాడు.

వెళ్తున్నానని కూడా చెప్పకుండా జీప్ వేపు నడిచాను. జీప్ లో కూచున్నాక వెనక్కి చూస్తే, దుఃఖంతో మెత్తబడిన కళ్లను అట్లాగే సాయంకాలం మసక చీకటిలోకి జొనిపి మావేపు చూస్తూ కన్పించింది పంకజం— మనస్సంతా ఆర్ద్రతతో, పంకజం మీది తెలీని సానుభూతితో వణికింది.

నేను దిగులుగా కూచోవడం గమనించి— "అంతేనండి—ఆడవాళ్లతో మాటాడడాన్ని ఊహించుకోవాలే గాని వాళ్లతో మాట్లాడకూడదు. అందువల్లనే కథల్లో ఆడవాళ్లూ, కలల్లోఆడవాళ్లూ బావుంటారు— ఇక పంకజమా!ఉఫ్!—హెచ్చు ఆలోచించకండి సార్—అది కొండపల్లి ఆటబొమ్మ"—

# నిదురపోయే సెలయేరు

అని ఎక్సిలరేటర్ నొక్కాడు. జీప్ కుదుపులను సహిస్తూ ఆలోచనలకు తావివ్వని శబ్దంతో మా శరీరాలను లాక్కుపోతోంది.

30 గజాలు నడిచిందో లేదో ఎవరో జీప్ని ఆపమని అరుస్తున్నారు.

జాన్ భయపడ్డాడు మొదట. జోరుగా హారన్ మోగించాడు. కాని జీప్ముందున్న వ్యక్తి తప్పుకోవడంలేదు. చివరికి యిక తప్పనిసరిగా ఆపేశాడు.

ముందు లైటులో మాణిక్యాన్ని గుర్తుపట్టాను నేను, బుజంమీద నల్లగళ్ల తువాలు, జబ్బలకు వెండి తావీజు, చేతిలో పొట్టికర్రా—మరో చేతిలో సగంవిరిగిన సీసా—

జీప్లోంచి దిగాలనిపించలేదు నాకు. జాన్మాత్రం సర్దుకున్నాడు. మాణిక్యం దగ్గిరికివచ్చి లోపలికి వంగితే కల్లు వాసన గుప్పుమంది.

"ఒరే కిందకిదిగు" అన్నాడు నన్ను చూసి.

"ఎందుకు" అందామంటే గొంతు విడవం లేదు.

ఇంకా తటపటాయిస్తే చెయ్యి పుచ్చుకొన్నాడు. చెమటతో, మట్టితో తడిసిన చెయ్యికింద నా వేళ్లనరాలు బలహీనంగా వణుకుతున్నాయి.

"చెయ్యివదులు. దిగుతాను."

దిగాక—మాణిక్యం ఏదో మాట్లాడబోయి, శరీరం తూలిపాటును ఆపుకోలేక బండిని ఆనుకు నిలబడ్డాడు.

"ఒరే, నిన్ను దానితో మాట్లాడొద్దని చెప్పానా?"

"ఎవరితో?"

"నోర్ముయ్-ఎవరితోనో నీకు తెలీదూ?- సీసా పగిలిపోయింది—లేకపోతే నిన్ను చంపేసేవాడినే?"—

"ఎందుకూ చంపడం?"

"చస్, మాట్లాడేవా, లేదా చెప్పు"—

"ఆ అమ్మాయికీ, నీకూ ఏం సంబంధం?"

కర్రతో జీప్మీద బాదాడు. "అవన్నీ అడక్కుస్సి. ఇదిగో, చెప్తున్నాను-రెండ్రోజుల్లో నువ్వు ఊరొదిలిపోవాలి - లేకపోతే బ్రతికుండగా గోరీ కట్టేస్తాను-నా బలంమీద నమ్మకం లేకపోతే ఊర్లో పదిమందిని అడుగు."

జాన్ ఏదో అల్లరి చెయ్యబోయి కొట్టడానికి కారు హేండిల్ తీయబోయాడు. అంతే-కన్నుమూసి తెరిచేలోపల చేతికర్రలోంచి పెద్దకత్తిని దూసాడు మాణిక్యం, అంతలో నిశ్శబ్దం వణికేలా నవ్వి "ఎవడీ పిచ్చిక?" అంటున్నాడు.

నాకు నిజంగానే భయమేసింది. మాణిక్యానికి కళ్లు మూతలు పడుతున్నాయి. ఇప్పట్లో మాట్లాడడం మంచిది కాదనుకున్నాను. "వదలండి - ఈ వెధవని ఒక్క దెబ్బతో చంపేస్తాను" అని అరుస్తున్నాడు. బలవంతంగా జీప్లోకి ఎక్కించాను—

మాణిక్యం రోడ్డుపక్క నిలబడి బూతులు తిడుతున్నాడు. జీప్ బయదేరుతూంటే లోపలికి తలవంచి "మరిచిపోకురోయ్— రెండ్రోజుల్లో దొబ్బెయ్యాలి" అంటున్నాడు—

"ఎవడండీ ఆ సాండ్రల్—వదిలే హేండిల్తో పొడిచేద్దును"—

కాస్త ఆగి-"రేపు ఉదయం వెళ్లి నంగు


## తెలుసుకొని బాగుపడండి




దాంపత్య సుఖాలు అనుభవించుచు గూడ, గర్భము రాకుండుటకుగాను అనేక దేశాలలోని ప్రముఖ డాక్టర్లు కనిపెట్టిన సరికొత్త 60 మార్గాలు "సంతానం" అనే తెలుగు పుస్తకంలో వున్నాయి. అవుసరం లేనపుడు గర్భంరాకుండా చేసే 60 మార్గాలు, సుఖప్రసవానికి గర్భిణిలు ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, పసిబిడ్డలను పుష్టిగా, ఆరోగ్యంగా ఎక్కువ ఖర్చు లేకుండా పెంచే మార్గాలు బొమ్మలతోసహా ఉన్నాయి. సంసార సమస్యలు తీర్చడానికి ఆధారపడతగిన పుస్తకరాజము. ఈ అద్భుతగ్రంథాన్ని మీరు చదివితీరాలి. రచన: ఏ. యస్. మూర్తి, యం. ఏ., వెల రు 3-50. పోస్టుఖర్చులు ఉచితం. "మూర్తి & వినాయకం" కిం, పీటర్స్ రోడ్, మద్రాసు-14 కు ఉత్తరం వ్రాస్తే వెంటనే మీకు వి. పి. పోస్టుద్వారా పంపబడును.

Swastik

గారిని పిలుచుకురా జాన్!—ఎవరికీ యీ విషయం చెప్పకు" అన్నా.

"ఈ ముక్కకి మళ్లీ జయ సెంగుకండీ— రేపు యిద్దర్నీ తీసుకొచ్చి పీడ ప్రాణం తో జేస్తాను"—

మాణిక్యం నన్ను తిట్టిన బూతుకంటె, అర్థం కాకుండా తెరవెనక ఉండిపోయిన రహస్యాల సందిగ్ధత యింకా బాధపెడ్తోంది. మాణిక్యానికి పంకజాన్ని ఎట్లా తెలుసు?— పంకజం ఎప్పుడూ ఏడుస్తూంటుంది ఎందుకని?—ఇలాంటివి.

* * *

ఓ రోజు ఉదయాన్నే—(రెండురోజుల తర్వాత అనుకుంటాను, సరిగా గుర్తులేదు)—తోటలో మాణిక్యంతో పంకజం తల్లి మాట్లాడుతూండగా చూశాను—[illegible] సిమెంటు బెంచీమీద కూచొని [illegible] గిస్తున్నాడు-ఏదో విసురుగా మాట్లాడుతూ, మధ్య మధ్య మేడ వేపు చూస్తున్నాడు.

మేడదిగి సరాసరిన తోటలోకి వచ్చాను. నన్ను చూసి పంకజంతల్లి తడబడుతోంది.

"నమస్కారం సాబ్—" అంటున్నాడు మాణిక్యం నవ్వుతూ. నవ్వులో నిర్లక్ష్యం తెలుస్తూ వుంది.

వినిపించుకోలేదు నేను—"ఏం కావాలి?" అన్నాను పంకజం తల్లితో.

"నీకెందుకయ్యా అది?" అన్నాడు మాణిక్యం.

"నువ్వు మాట్లాడకురా" అని అదిలిస్తోంది-

నాకు విసుగేసింది "ఇట్లాంటి వేషాలేవీ నాకు పనికిరావు. పోలీసులకి రిపోర్టు నిన్ననే పంపించాను. రేపటికి వస్తారు. ఇద్దరూ పోలీసుస్టేషన్లో జవాబులు చెప్పుకోండి" అని వచ్చేశాను.

అన్నానే కాని మాణిక్యం వాళ్ళకి దొరకడని ఎట్లాగూ తెలుసు...కొన్ని క్షణాలు గడిచాక, అట్లా అనడం నాకే ముప్పు అన్న విషయం హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది.

మొత్తంమీద కొండపల్లి జీవితంమీద ఏవో దిగులు ముసుగు కప్పుకొన్నట్లనిపించింది. పంకజంతల్లోనున్న స్థిమితాన్ని యివ్వకుంటే జవ్వను - ప్రతీవ్యక్తీ ఏదో ప్రళయాన్ని దాస్తున్నట్టూ-దొంగతనంగా బ్రతుకుతున్నట్టూ అనిపించింది. ఆ దొంగతనం ఈ స్థలంలోనే ఉందేమో- పిచ్చివాళ్ళని చూసిన కొన్నేసటికి, ఎవరికి నిజంగా పిచ్చో అర్థంకానట్టు, కొన్నాళ్ళయేసరికి మనలోనే ఆ దొంగతనం ఉన్నదా అనిపించేట్టుంది పరిస్థితి. మనగురించి ఎవరూ ఆలోచించక పోవడంలోనూ తృప్తి ఉంది-అందరిదృష్టిలో ఉంటూ బ్రతకగలగడం జీవితానికి పెద్దశిక్ష.

"భగవాన్! నాను నేను ఒక్కక్షణం బ్రతికే అవకాశం కల్పించు" అనుకోవడం ఎంతహాయి!

నాలుగ్రోజుల తరువాత పని ఎట్లా జరుగుతోందో చూడడానికి సింగు వస్తే యిక్కడ రోజులు గడపడం ఎంతదుర్భరంగా ఉందో వివరించాను.

"ఏం?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఇంతనిశ్శబ్దంగా-ఈ కొండలూ, చెట్లూ, సెలయేళ్ళూ, ఎంతసేపూ సంస్కారంలేని మనుషులతో గడపడం - రచనకు కూడా ఓమీడియమ్ కావాలేమో గాని-యింత సుండె బద్దలు చేసే శూన్యంమాత్రం కాదు-ఇక్కడ నాలాంటి వాళ్లు కాదు. ఋషులు తపస్సు చేసుకోందుకు బాగుంటుంది. ఇది ప్రశాంతత కాదు-భయంకరమైన ప్రళయం" అన్నా.

ఆవేం బోధపడలేదు సింగుకి.

"ఆ అమ్మాయి ఏదన్నా గొడవ చేసిందా?"

"ఏ అమ్మాయి!"

నవ్వేశాడు.

"ఆ దొంగవెధవకి భయపడుతున్నావల్లే వుందే!—అదంతా నేచూస్తాలే."

ఇంకా ఆశ్చర్యపోతున్న నా భుజంతట్టి "జాన్ నాకంతా చెప్పాడులే - నువ్వంటే వాడికి అభిమానమే" అన్నాడు మెల్లగా.

ఆతర్వాతఇహ మరీ విసుగుపుట్టింది రోజులు గడపడానికి - పంకజం రావడం పూర్తిగా మానేసింది-ఆ నిర్లక్ష్యంతో నామీద ఏదో పగతీర్చుకొంటున్నట్టూ - నేను చేసిన పని తప్పని ఎత్తి చూపుతున్నట్టు కన్పించింది.

పోలీసుల భయం చూపి, ఏమీ చెయ్యలేక పోయిన నన్ను పరిహసిస్తున్నట్టుగా మేడ ముందు ఎలక్ట్రిక్ స్తంభానికి చేరబడి నిలబడే వాడు మాణిక్యం

పదిరోజులాగి "నన్ను బదిలీ చేస్తారా! రాజీనామా యిచ్చేదా?—యిక్కడ ఈ మనుషులూ, వాతావరణం మధ్య నలిగిపోతున్నాను" అని ఉత్తరం రాశాను సింగుకి—

మర్నాడే జవాబు వచ్చింది—"నీ కిష్టంలేకపోతే వచ్చెయ్-మనిషిని పంపుతాను. కాని కొండపల్లి పెద్ద అవకాశం, జీవితంలో పాఠం నేర్చుకోవడానికి"-అని వ్రాశాడు.

నాకు నవ్వొచ్చింది-నిజమే. పెద్ద పాఠం నేర్పడానికి అవకాశమే.

మర్నాడు మాణిక్యం స్తంభం దగ్గర నిల్చుంటే లోపలికి పిలిచాను.

ఒక పిచ్చాసుపత్రి నుంచి యిద్దరు వ్యక్తులు పారిపోయి ఒకచోట కలుసుకొన్నారు.

ఒక వ్యక్తి: ఒరేయ్ నాబుర్ర ఎక్కడో జారిపోయిందిరా నీకు కనబడిందా!

రెండవ వ్యక్తి: నీ జేబుకు చిల్లుందేమో చూసుకోరా!

తాడూరి దుర్గాప్రసాద్
(తాడేపల్లిగూడెం)

వచ్చి "ఏం" అన్నాడు.

"రేపే వెళ్ళిపోతున్నాను"

నమ్మకంలేక విస్తుపోయి చూశాడు—

"అవును, నిజం"

"మంచిది సార్ - మీరు చాలా తెలిసిన వారు-అందుకనే నా చెయ్యికదల్లేదు-ఎప్పుడు వెళ్తారు?"

"రేపు ఉదయం"

నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

సాయంకాలం పంకజం కన్పిస్తుందేమోనని ఆ యిళ్ల వేపు ఒంటరిగా వెళ్ళాను. కనిపించలేదు. ముల్లుగుచ్చుకొన్న రాయి దగ్గర ఓగంట కూర్చొని వచ్చేశాను.

జాన్ కన్పిస్తే "పంకజం కన్పించిందా?" అని అడిగాను.

"లేదు సార్-వాళ్ళ బంధువుల దగ్గరికి—పక్క ఊరు పంపేసిందట వాళ్ల అమ్మ"

క్షణం విస్తుపోయేను.

"రేపు ఉదయమే వెళ్లిపోవాలి-నా ట్రంకు బట్టలు సర్దమను" అని చెప్పాను.

తెలతెలవారకుండానే వాకిట్లోకి వచ్చి కూచున్నాడు మాణిక్యం. నేను నిర్ఘాంతపోయేను. "సామాను గేటుకి చేరవేసేపనంతా నాకు వదిలెయ్యండి బాబూ. జీప్ స్టేషన్‌కు చేరేవరకి పెట్టెలన్నిటితో అక్కడుంటాను—చెయ్యి సాయంకూడా తెచ్చుకున్నాను" అన్నాడు.

స్టేషన్లో - ఎదురుగ్గా సిమెంటు బెంచిని ఆనుకుని నిలబడ్డాడు మాణిక్యం చేతులుకట్టుకొని-జాన్ యింకా వాడిమీద కోపంతో కొరకొరా చూస్తూంటే నవ్వి దగ్గరికి వచ్చి భుజంమీద చెయ్యి వేసేడు "నీమీద నాకేం కోపం లేదుగా-నీకోపంమీద మాత్రం కోపం వచ్చింది"—

రైలు కదుల్తూంటే కిటికీ దగ్గరికి వచ్చేడు. "నేనేం చెడ్డ ఎదవని కానండి—కానిమనిషినయిపోయేను"-అన్నాడు.

నేను నిర్ఘాంత పోయాను. ఒక్క వాక్యం నాకర్థం కాలేదు. మాణిక్యం యింకా అలాగే నిలబడి ఉన్నాడు.

వాణ్ని తప్పు అర్థం చేసుకొన్నానేమో ననిపించింది. వాడి తీరుపోయే అంతేనేమో. ఏది ఏమయినా మాణిక్యంలో యీమార్పు చాలా వింతగానే వుంది. ఈ వ్యక్తిత్వాన్ని ఎందుకు దాచుకున్నాడా అన్న ఆశ్చర్యం వదల్లేదు. చివర అని పోయిన రెండు వాక్యాలూ తీరని సమస్యలయాయి—

* * *

కొన్ని సంఘటనల్ని మనం మరిచిపోము. ఆ సంఘటనలే మనల్ని మరిచిపోతాయి. అలాగే కొండపల్లి ఖిల్లా విషయమూను—

"నువ్వు ఓడిపోయావ్—ఆడది నిన్ను జయించి, వెనక్కి తిరిగేసరిక్కి యింత నిస్సహాయంగా నిన్ను వదిలేసి పోయింది" అని నవ్వేడు సింగు.

"ఆడది కాదు—కన్నీళ్లు" అందామనిపించింది. అవన్నీ నా బలహీనతను దాచుకోవ

డానికి నేను చేసే దొంగతనాలని సింగు అను కొంటాడేమోనని మాట్లాడలేదు.

కన్నీళ్లలో స్త్రీ చరిత్ర ప్రారంభమయి చిరునవ్వుతో ముగుస్తుంది. మొదటిది ప్రణయం, రెండవది ప్రళయం.

పంకజాన్ని ఎందుకు గుర్తుంచుకోవాలా? అని పదేపదే అనుకున్నాను. కారణాలను ఊహించగలశక్తిని మించి ఆలోచించినకొద్దీ పెరిగిపోతోంది మనస్సులో పంకజం—ఆ కళ్లను, ఆ నిశ్శబ్దాన్నీ, ఆ కన్నీళ్లను, ఎన లైజ్ చేసి—వ్యక్తిత్వానికి రూపును యివ్వ గల శక్తిలేదు నాకు.

పంకజం మనస్సును పాల్వ చేయడం దేవుడి సమస్యలలో—ప్రేమకు పరిష్కారం యివ్వడంలాగు, మంచితనానికి అవధి నిర్ణ యించడంలాగు—అతి క్లిష్టమైన తెగని సమస్య ఏమో మరి.

భాషలో రూపంలేని మహాకావ్యం—మాటలకు అందని అదే తన ఔన్నత్యం—ఓ చిరునవ్వు, కన్నీరు, పిరికితనం,—యిదీ పంకజం.

ఆరేళ్ల తర్వాత మళ్లీ ఆమె కన్పిస్తుందని ఎలా అనుకుంటాను?

* * *

మా శాఖాధికారికి వీడ్కోలు యివ్వా లంటే మిగతా ఉద్యోగులందరితో పాటు విజయవాడ స్టేషన్‌కు వచ్చాను. చాలామంచి వాడు. ఉన్నన్నాళ్ళూ ఎవరికీ ఉపకారం చెయ్యలేదు. కాని ఎవరికీ అపకారం చెయ్యని అతనితాటస్థ్యాన్ని మిగతా ఉద్యో గులతో పోల్చుకుని అతను మంచివాడే అని నిర్ధారించారు, ఉద్యోగులంతా. ఈ హడా వుడి వద్దంటున్నా రైలుస్టేషన్‌వరకూ సన్మా నాలతో వెన్నాడారు. ఒకొక్కప్పుడు మంచితనం కూడా భరించరాని మోతాదులో పెరిగిపోతే సుఖాన్ని చంపేస్తుంది—బిక్క చచ్చి పూలమాలల్ని అందుకొంటూ, స్టేషన్లో అందరిచూపూ తనమీద పడడం భరించలేక గింజుకొంటున్నాడు ఉద్యోగి.

నాకు నవ్వొచ్చింది. ప్లాటుఫారంమీద పచార్లు ప్రారంభించాను.

బుక్ స్టాల్ దగ్గర ఆగబోయేసరికి స్తంభం




# నిదురపోయే సెలయేరు

దగ్గర కూర్చున్న వ్యక్తుల్ని చూసి నిర్ఘాంత పోయేను—పంకజంలో అంత మార్పు వస్తుం దని కలలో కూడా నేను ఊహించలేని విషయం. బొద్దుగా, విశాలంగా పెరిగిన చెట్టులాగు, వంపులన్నీ మరిచిపోయి ఒకే ఆకారంగా—బరువుగా తీరిన శరీరంలో ఎక్కడో పాతపంకజం పోలికలు ఆ కళ్లలో ఆ పెదాల్లో లీలగా కన్పిస్తున్నాయి- పాత పంకజానికి పెద్దగుర్తు కళ్లల్లో యింకా పిరికి తనం - కాని మరీ ఆశ్చర్యపరిచిన విషయం చుట్టూఉన్న పిల్లలు. పక్కనేఉన్న పెట్టె మీద ఇద్దరుపిల్లలు కూర్చొన్నారు. ఇద్దరికీ నాలుగేళ్లు దాటిఉండవు. ఒక కుర్రాడు బలంగా శంఖంలావున్న ఆమె మెడచుట్టూ చేతులుచుట్టి మారాం చేస్తున్నాడు. వాడిని ఊరడించడం ఎలాగో తెలీక తికమక పడుతోంది.

నాకంతా వింతగావుంది. మనిషిలో అంత పెరుగుదల ఊహించలేని నేను స్తబ్ధుణ్ణయాను. వొళ్లోకి కుర్రవాణ్ని తీసుకుని ముద్దుపెట్టు కుంటోంది.

ఎప్పుడూ ఆమెగురించి ఆలోచించేందుకు ప్రయత్నించక పోయినా యిన్నాళ్లతర్వాత కన్పిస్తే మళ్లీ ఓసారి ఎదుటికి రావాలని పించింది. ఇంకా కొన్ని సందేహాలు అలానే ఉండిపోయాయి. చుట్టూ చూసినా ఆమెకు సంబంధించిన వ్యక్తి ఎక్కడా ఉన్నట్టు తోచలేదు.

నన్ను చూసే ఏమనుకొంటుందో- చూసి, అంతలో నవ్వి పలకరించవచ్చు- పెళ్లిగురించి అడుగుతుందేమో ?-ఆ కుర్రాళ్లని చూపించి 'ఏమీచేతకాని నీకంటె నేను చాలానయం' అని కళ్లతో మాట్లాడితే! ఏమైనాగానీ- ఓ సారి పలకరించాలన్న ఉబలాటం ఎక్కు వయింది.

ఎనిమిదేళ్ల క్రిందటి ఒక్క సందేహం యిప్పటికీ వదల్లేదు- అప్పటి పంకజం విము ఖతకు కారణం ఆలోచిస్తే అర్థంబోధపడదు- అందుక్కారణం, మాణిక్యవా?-? లేక పంక జంలో పిరికితనవా ?- తెలీదు.

లేచి కొడుకుని ఎత్తుకుని గోడనున్న బొమ్మవేపు చూపిస్తోంది. బుక్‌స్టాల్ నిష్క్ర మించి కదిలాను. బొమ్మపక్కకివచ్చి నిల బడ్డాను. ఈ సారి బొమ్మని చూపించ బోయి నన్ను చూసి దిక్కురపోయింది. క్షణం భయపడిందేమో. కొడుకుని గట్టిగా గుండెకు అదుముకొంది—

నవ్వుదామనుకుంటే పెదాలు వణికాయి- శక్తిలేక క్రింది పెదవిని నొక్కి పట్టు కొన్నాను-

క్షణం ఆగి స్తంభానికి ఆనుకు నిలబడ్డది- నావేపునుంచి దృష్టి మళ్లించలేదు. ఆ కళ్లల్లో యింకా ఏదో అనుభూతి- అలానే-

ఒక్కసారి హఠాత్తుగా చుట్టూ పరికిం చింది. నేను దగ్గరికి వస్తే కుర్రాణ్ని కింద దింపేసి కొంగు సరిచేసుకుంటోంది

సంజ్ఞ చేస్తూనే పలకరించాను.

ఇంకా నన్ను విచిత్రంగా చూస్తూనే వుంది. కళ్లలో మళ్లీ పాతఆశ, కోరికా - లేకపోతే నేను పొరబడ్డానేమో ?-

అంతలోనే రెండు చేతులూ గుండెకు ఆనించుకుని- తొందరగా ఏదో సంజ్ఞ చేస్తోంది.

నాకు అర్థంకాదు- ఎటువేపో చూసి మళ్లీ చెప్పింది.

ఈసారి—అవును—అర్థమయింది.

"మీకో నమస్కారం చేస్తాను—నాతో మాట్లాడకండి ఆయన చూస్తే నా ప్రాణం తీస్తాడు—" ఇదీ నాకు బోధపడిన విషయం. 'ఆయన'ను ఎటువేపో చూసి సూచించింది.

మొదటిసారిగా, చివరిసారిగా పూర్తిగా క్రుంగిపోయేను. బుక్‌స్టాల్‌లో బుద్ధుడి అట్ట నీడ అడ్డంగా ముఖంమీదపడి నా కదలికల్ని కప్పిపుచ్చింది. పిల్లలు ఎదురుగ్గా వెలిగిఆరేలైట్ల వేపు చూస్తున్నారు. పంకజం నావేపు చూడడం వెయ్యియుగాల క్రిందటే మానే సింది. కొడుకుచుట్టూ నీలిరంగు కొంగుతిప్పి దగ్గరగా హత్తుకుని పెట్టెమీద కూచొంది— పిల్లాడి తలమీద గడ్డం ఆనించింది. మొదట ఏడుస్తుందేమో ననుకొన్నాను. దిగులుగా రైలు పట్టాలవేపు చూస్తోంది.

శరీరమంతా చెమట పోస్తోంది—నడవ లేనంత నిస్త్రాణగావుంది—అంతకుమించి పంకజం నఖరి— 'స్త్రీలో యింత మార్పు సాధ్యమా?' అన్న ఆలోచన మెదడుని కొరుకుతోంది—

పక్కకి అడుగు వేయబోతే సామాన్లు మోసుకొచ్చే బండివాడు కేక పెట్టాడు— సిగ్గుపడి పక్కకి తప్పుకున్నాను.

రైలు విపరీతమైన శబ్దం చేసుకొంటూ వచ్చింది. త్వరత్వరగా పిల్లలందర్నీ లేవదీసి ఎవరికోసమో నన్నుతప్ప—మిగతా అన్ని చోట్లా కళ్ళతో వెదుకుతోంది పంకజం. పక్కనే నీడలో ఉన్నానని తెలిసికూడా నన్ను చూడడం లేదు—

మెల్లిగా నడక ప్రారంభించాను—

పదిగజాలు నడిచాక ఎవరో నన్ను పిలు స్తున్నారు. పక్కకి తిరిగితే ఫ్లాస్కు పట్టు కుని అతను—అతనే! — పేరు జ్ఞాపకంరా వడం లేదు—మాణిక్యం!—అదీ అతని పేరు—

నిర్ఘాంతపోయేను. 'మాణిక్యం' అన్నాను నీరసంగా. రైలుగొడవనున్న శబ్దం సగం చచ్చిపోయింది.

"అవును బాబూ... నేనే!—కులాసాగా వున్నారా? చాలా చిక్కిపోయారే— భిలాయ్‌లో ఉద్యోగం దొరికింది బాబూ— పోతున్నాను."

చేతిలోని ఫ్లాస్కు బుజానికి తగిలించు కొన్నాను.

"వస్తాను బాబూ—పెళ్లాం, పిల్లలు

యిక్కడే వున్నాగా—అరె! మీరు చెప్ప లేదే!—పంకజం యిక్కడే ఉంది చూస్తారా?—నాకు ముగ్గురు పిల్లలు—"

ముఖం తిరుగుతుందేమోనని భయం వేసింది. నీరసంగా నవ్వాను—

"ఇప్పుడు రాలేను మాణిక్యం—తొందర పని వుంది—సంతోషం—" అని నీడలోకి తిరిగి నడిచి వచ్చేశాను—

* * *

ఇప్పుడిక పాతిక ఫలకి ఓ తోవంటూ కన్పించింది. కాని పంకజం గురించి ఆలోచించిన కొద్దీ విచిత్రమైన సమస్య మాత్రమే మిగులుతోంది.

కోరిక కోసం పరిస్థితుల్ని ఎదిరించడం సాధ్యమని ఊహించలేని పంకజం-సంప్రదాయాలకులొంగి అధికారానికి పిల్లల్ని కన్నది.

కాని పాత సంప్రదాయాలపై తిరుగుబాటు చేయలేని బలహీనతే మాణిక్యం లాంటి వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి కారణమయితే ఆరేళ్ల క్రితం కొంపెపల్లి అనుభవాలకి, అప్పటి ఆమె చిరునవ్వుకి, ఆ కళ్లల్లో ఆహ్వానానికి అర్థంలేదు.

ఆలోచించిన కొద్దీ ఈ వింతప్రవృత్తి ఒక్క పంకజానికే కాక 'స్త్రీ'కే సహజమనిపిస్తుంది. అభిరుచికంటే అనుభవం పట్ల ఆకాంక్ష ఎక్కువ స్త్రీకి. పురుషుడి కట్లా కాదు. అనుభవంకన్న అభిరుచి ముఖ్యం. అందువల్లనే సంప్రదాయాలను, నైతిక పరిధులను త్రెంచుకుపోయే శక్తి, తెగింపు పురుషుడికంటె, స్త్రీకి ఎక్కువ—

పురుషుడి ప్రేమ కథ ప్రేమని ప్రేమించడంతో ప్రారంభమయి, స్త్రీని ప్రేమించడంతో ముగుస్తుంది. కాని స్త్రీ మొదట పురుషుణ్ని ప్రేమించడంతో ఆరంభించి, ప్రేమని ప్రేమించడంలో తృప్తిపడుతుంది. అందుకనే ఆమె ఎన్నిసార్లయినా ప్రేమించగలుగుతుంది- ఎందుచాతనంటే ఆమె ప్రేమించేది పురుషుని కాదు కనుక- ప్రేమని గనుక- ప్రేమా?- ఉఫ్!- ఇరవయ్యో శతాబ్దపు మానవుడు అర్థం తెలీని రోగానికి అవ్యాహతంగా పుచ్చుకొనే ఒక చీప్ టానిక్— అదీ ప్రేమకి నిర్వచనం—

కాస్త ఆలోచిస్తే ప్రేమదీ ఏమీ తప్పు లేదనిపిస్తుంది —ప్రేమ జన్మస్థానం కోరిక- కోరిక జన్మస్థానం – స్త్రీ!

ఇంత ఆలోచించికూడా పంకజం జీవితం పట్ల సానుభూతి చూపించలేకపోతోంది మనస్సు. ఒక్కసారి ఆమె మాటాడగలిగితే బావుణ్ను. సంస్కారాన్ని పూరించుకోలేని ఆమె స్త్రీత్వం చేసినపొరపాటేమో అది – అనుకుందామన్నా సరికాదు-

స్త్రీ ఎప్పుడూ పొరపాటు చేయదు. తనతో గడిపినవాళ్లంతా పొరపాటుచేశారనిపించేట్లు చేస్తుంది.

ఏమైనాగానీ—పంకజం చర్యలకు వేరే అర్థం ఏమీ కన్పించదు. ఆకాశం నీలానికి, కొండ స్థిమితానికి అర్థంలేనట్టు— ★


METTUR INDUSTRIES LTD.
METTUR MULL

# మెట్టూరు
## మల్లులు • లాంగ్ క్లాత్

మెట్టూరు మల్లులు – శ్రేష్ఠమైన మల్లులు

తయారించువారు
మెట్టూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్,
మెట్టూరు డామ్ ఆర్. యస్., సేలమ్ జిల్లా

మ్యానేజింగ్ ఏజెంట్లు
డబ్ల్యు. ఎ. బియర్డ్సెల్ & కంపెనీ
(ప్రైవేటు) లిమిటెడ్, మద్రాసు–1



మీరు ఎప్పుడైనా సుఖవిరేచనకారి కొరకు
డాక్టరు వద్దకు వెళ్ళితే....
వారు వెంటనే



## లక్సామింట్

– సుఖవిరేచనకారియగు
తియ్యని పిప్పరిమెంట్ – చెప్తుతారు
దాని సుగుణములు వారికి
బాగా తెలుసు.

డిస్ట్రిబ్యూటర్లు
M/s. సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)
విజయవాడ & బ్రాంచీలు.
Publicity Arts





## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.